ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



కర్ణాటక వార్తలు
ఆదివారం 23 నవంబరు 2025

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
విద్యార్థులకు డీవైఎస్పీ సిద్ధలింగప్ప గౌడ సూచన

కేంద్ర చట్టాలపై ఏఐయూటీయూసీ
6 నిరసన
కార్పొరేట్లకే మేలు చేస్తున్నారని మండిపాటు



అలంకరణలో మహా సమాధి

వందేళ్ల ప్రేమ

● నేడు సత్యసాయి బాబా శత జయంతి ● వేడుకలకు ముస్తాబైన హిల్‌వ్యూ స్టేడియం

పుట్టపర్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆధ్యాత్మిక కేంద్రం అందంగా ముస్తాబైంది. ఇప్పటికే దేశ, విదేశాల నుంచి తరలివచ్చిన సాయి భక్తులతో పుట్టపర్తిలో సందడి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం, సత్య సాయి సెంట్రల్ టస్టు సంయుక్త ఆధ్వర్యంలో సత్యసాయి శత జయంతి ఉత్సవాలను పుట్టపర్తిలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలు ఈనెల 13న ప్రారంభం కాగా ఇప్పటికే ప్రధాని, రాష్ట్రపతి, గవర్నర్లు, ముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, దేశవిదేశాల నుంచి వచ్చిన లక్షల మంది భక్తులు పుట్టపర్తిని సందర్శించారు. పుట్టపర్తి హిల్‌వ్యూ స్టేడియం సత్యసాయి శతజయంతి వేడుకలకు వేదిక కానుంది. ఉదయం 9 నుంచి 11 గంటల దాకా నిర్వహించే వేడుకల్లో ఉపరాష్ట్ర పతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి నారాలోకేశ్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, సేవా దళ్ కార్యకర్తలు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో హిల్‌వ్యూ స్టేడి యాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.



పూర్ణచంద్ర ఆడిటోరియంలో జరిగిన సత్యసాయి శత జయంతి వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులు, భక్తులు



రాష్ట్రపతి ద్రౌపది ముర్మును స్వాగతిస్తున్న మంత్రులు



మహాసమాధికి నమస్కరిస్తున్న రాష్ట్రపతి



ఏపీ సీఎం చంద్రబాబునాయుడు పుష్పాంజలి



రాష్ట్రపతిని ఆశీర్వదిస్తున్న వేద పండితులు



హాజరైన నాయకులు, అధికారులు



వేదికపై మాజీ ప్రధాని దేవెగౌడ, కుమారస్వామి తదితరులు

బీజేపీతోనే ఎన్నికలకు..!

● మైత్రిబంధానికి ఢోకా లేదు : మాజీ ప్రధాని దేవెగౌడ

బెంగళూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో ఎటువంటి ఎన్నికలైనా బీజేపీ కూటమితో కలిసి ముందుకు సాగుతామని జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని దేవెగౌడ స్పష్టం చేశారు. శనివారం పార్టీ సిల్వర్‌జుబ్లీ వేడుకలలో భాగంగా పార్టీ కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రానున్న ఆరేడు నెలల్లో రాష్ట్రంలో రాజకీ యాలు ఎవరూ ఊహించని విధంగా మార్పులు జరగనున్నాయని జోస్యం పలికారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనా వైఖరి, ప్రస్తుత రాజకీయ సన్నివేశాలపై విస్తృతంగా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కొనసాగుతున్న తీరును చూసే బీజేపీతో కొనసాగాలని కుమారస్వామి సూచించార న్నారు. 2028 ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగేం దుకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. రాజకీయాలను పరిశీలిస్తే ఎక్క డికి వెళ్తున్నామనేది చెప్పడానికి వీలులేదన్నారు. రానున్న ఎన్నికల్లో 80సీట్లు జేడీఎస్‌కు కావాలని కోరాలంటే అందుకు తగ్గట్టుగా కార్యకర్త లను శక్తిని పెంచుకోవాలన్నారు. 2019లో కుమారస్వామి సీఎంగా కొన సాగుతున్నప్పుడు ప్రభుత్వాన్ని కూల్చింది ప్రస్తుత ముఖ్యమంత్రి అని పరోక్షంగా సిద్దరామయ్యను ప్రస్తావించారు. రహస్యాలను దాచలేమని అవి ఎప్పటికైనా బహిరంగం అవుతాయన్నారు. జేడీఎస్ పార్టీ రాష్ట్ర అధ్య క్షుడిగా కుమారస్వామి కొనసాగుతారని, ప్రస్తుతానికి మార్పులు చేయలే మని ఆయన స్పష్టం చేశారు.

కార్యకర్తలను ఉద్దేశించి కేంద్రమంత్రి కుమారస్వామి మాట్లాడుతూ బిహార్‌లో ప్రాంతీయపార్టీ ఏ విధంగా తన సత్తా చాటిందో కర్ణాటకలోనూ జేడీఎస్ ఎక్కువసీట్లు గెలుస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యకర్తలు నాయకులు ప్రజలమధ్యనే ఉండి పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆయన విరుచుకుపడ్డారు. గ్యారెంటీల పేరిట ప్రజల జేబుకు కత్తెర వేశారన్నారు. గ్యారెంటీలు ఇస్తున్నామని గొప్పలు చెబుతున్నారుగానీ, పన్నుల భారంతో ప్రజలను వేదిస్తున్నారన్నారు. అభి వృద్ధి పనులు నిలిచిపోయాయని ప్రజలు అర్థం చేసుకోవాల్సి ఉంద న్నారు. చెరకు రైతులు ట్రాక్టర్లకు నిప్పు పెట్టే పరిస్థితి వచ్చిందంటే వారి ఆవేదనను అర్థం చేసుకోవాలన్నారు. మలవళ్ళిలో అన్నదాని పోటీ చేసిన ప్పుడు ఖర్చులు భరించలేనని వెనుకడుగు వేస్తే తానే అన్నీ చూసుకుంటానని హామీ ఇచ్చి గెలిపించానన్నారు. దేవెగౌడ రాజకీయంగా ఎవరికీ అన్యాయం చేయలేదన్నారు. ఐదేళ్లపాటు సంపూర్ణ మద్ద తుతో అధికారం ఇస్తే రాష్ట్రంలో అభివృద్ధి ఏ విధంగా చేయాలనేది అమ లు చేసి చూపుతానన్నారు. వేదికపై కుమారస్వామి వార సుడు, యువ నాయకుడు నిఖిల్ తదితర జేడీఎస్ నాయకులు ఉన్నారు.



సిల్వర్ జూబ్లీ లోగోతో మాజీ ప్రధాని

మొక్కజొన్న, పెసలుకు గిట్టుబాటు ధర కల్పించండి

● ప్రధానికి సీఎం లేఖ

బెంగళూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మొక్క జొన్న, పెసలు సాగు చేస్తున్న రైతులు గిట్టుబాటు ధర కోసం ఎదురుచూస్తున్నారని, ధరలు పడిపోవడంతో నష్టాలు చవి చూడాల్సి వస్తోందని కేంద్రం సహక రించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి సీఎం సిద్దరా



మయ్య లేఖ రాశారు. ఆ లేఖను శనివారం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మొక్కజొన్న, పెసలు ధరలు తగ్గిపోయాయని గుర్తు చేశారు. కర్ణాటకలో లక్షలాదిమంది రైతులకు రెండు పంటలు ప్రధాన మైనవన్నారు. ఖరీఫ్‌లో 17.94 లక్షల హెక్టార్లకంటే ఎక్కువ మొక్కజొన్న, 4.16 లక్షల హెక్టార్లలో పెసలు సాగు చేశారన్నారు. 54.74 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న, 1.983 లక్షల మెట్రిక్ టన్నుల పెసలు దిగుబడి రానుందన్నారు. కేంద్రప్రభుత్వం టన్ను మొక్కజొన్నకు రూ.2,400 ఉన్నా మార్కెట్‌లో 1,600 - 1,800 మాత్రమే ఉందన్నారు. టన్ను పెస లుకు రూ.28,768 గిట్టుబాటు ధర ఉందని అయితే మార్కెట్‌లో రూ.5,600 మాత్రమే ఉందని గిట్టు బాటు ధర పెంచి రైతులను ఆదుకోవాలని కోరారు.



గన్ శాట్..!

● 47వేల సర్కారు పాఠశాలలకు ఏఐ సాంకేతికత
● శాట్ వెబ్‌సైట్‌తో పక్కా సమాచారం
● అటెండెన్స్, మధ్యాహ్న భోజనం వివరాల నమోదు
● ప్రతి విద్యార్థి ఫొటో శాట్స్‌తో అనుబంధం

బెంగళూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పర్యవేక్షణ కొరవడిందని, మౌలిక సదుపాయాలు లేమి వెంటాడుతోందనే ఆరోపణలు తరచూ వినిపిస్తుంటాయి. ప్రభుత్వ పాఠశాలల్లో సమగ్రమైన విద్య అందడం లేదని, అందుకే పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారనేది నిత్యసత్యమే. ఇకపై అలా జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేయనుంది. శాట్(స్టూడెంట్ అచీవ్‌మెంట్ ట్రాకింగ్ సిస్టం) కేవలం నాలుగైదేళ్లలోనే లక్షలమంది విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడం విద్యాశాఖకు సవాల్‌గా మారింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఏకోపాధ్యాయ పాఠ శాలల్లో ఉపాధ్యాయులు హాజరు వేయడం, మధ్యాహ్న భోజనం పర్యవేక్షించడంతోనే ఎక్కువ సమయం సరిపో తోంది. ఇక్కడ బోధనలు ఎక్కడ అనేది అంతుచిక్కని విష యంగా ఉంది. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1-7 తరగ తుల దాకా విద్యార్థులు ఉన్నా ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే పనిచేసే పరిస్థితి కూడా ఉంది. ఇలా విద్యాశా ఖలో ఉన్న లోపాలను సరిదిద్ది, సాంకేతికంగా పర్యవేక్షిం చేందుకు సర్కారు సిద్ధమైంది.

రాష్ట్రంలోని 47 ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు అటెండెన్స్ వేయడమే, మరికొన్ని రోజుల్లో నిలిచిపోనుంది. ఇందుకు (ఏఐ) కృత్రిమ మేథస్సు సహకారంతో విద్యా ర్థుల హాజరు ప్రక్రియను ప్రత్యేక విధానంతో సేకరించాలని నిర్ణయించారు. రాష్ట్రప్రభుత్వం ఏఐ విధానంలో రూపొందించిన సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. ఉపాధ్యాయులు తర గతి గదిలో ఓ గ్రూప్ ఫొటో తీస్తే చాలు, క్షణంలోనే విద్యార్థుల అటెండెన్స్ పూర్తికానుంది. అవుట్‌సోర్స్ లేకుండా స్వయంగా ప్రభుత్వం తరఫున సాంకే తిక నిపుణులు, మొబైల్ యాప్‌ను సిద్ధం చేశారు. ఇప్పటికే ప్రయోగాలు కూడా విజయవంతంగా పూర్తయ్యాయి. అంచెలంచెలుగా పాఠశాలలకు అను సంధానం చేయడమే తరువాయిగా ఉంది. ఈ ప్రయత్నం, సాంకేతికతకు సంబంధించి అధికారులు తెలిపిన మేరకు అటెండెన్స్‌ను సూక్ష్మ పద్ధతిలో చేప ట్టాలని భావిస్తున్నామన్నారు. తర గతి గదిలో ఎంతమంది ఉన్నారు, ఎవరు ఉన్నారనేది యాప్ ద్వారానే సేకరించే అవకాశం రానుంది. ఎప్పటినుంచి అమలు చేయాలనేది ప్రభు త్వం ఇంకా ఖరారు చేయలేదు. వచ్చే ఏడాది ప్రారంభంలో సాంకేతికతను అను సంధానం చేస్తారా..? లేదా వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాటిం చాలా అనేది తేలాల్సి ఉంది.



శాట్ వెబ్‌సైట్

● ప్రస్తుతం అటెండెన్స్ రిజిస్టర్ ప్రకారం పేర్లను చదివి హాజరయ్యారా..? లేదా అనేది నమోదు చేస్తారు. హాజరు కాని పక్షంలో ఆబ్సెంట్ నమోదు చేస్తారు. కానీ ఇందులో వ్యత్యాసంగా నమోదు చేసేందుకు వీలుంది. కొన్ని పాఠశాలల్లో ఇలాంటి అవినీతి చర్యలు కొనసాగుతున్నాయి. అందుకు ప్రధాన కారణం మధ్యాహ్న భోజనంతోపాటు వారికి అందించే గుడ్లు, చిక్కీల మంజూ రులో వ్యత్యాసం చూపుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. యాప్ ఉపయోగిస్తే కేవలం కొన్ని క్షణాలోనే మారుమూల పాఠశాలనుంచి మహానగరం దాకా ఏ పాఠశాలలోని ఏ తరగతిలో ఎంతమంద విద్యార్థులు హాజరయినారనేది విద్యాశాఖ కేంద్ర కార్యాలయంలోని డ్యాష్ బోర్డులో నమోదు కానుంది. అంతే కాక ఏ పాఠశాలలో ఏ సౌకర్యాలు ఉన్నాయనేది కూడా తేలిపోనుంది.

విద్యాశాఖ కేవలం విద్యార్థుల హాజరే కాకుండా స్టూడెంట్ అచీవ్ మెంట్ ట్రాకింగ్ వ్యవస్థను (ఎస్ఏటీఎస్) కట్టుదిట్టంగా రూపొందించారు. ఇక్కడ విద్యార్థులు ఫొటో రహితంగా సమగ్ర సమాచారం ఉంటుంది. ఈ సాంకేతికతను సద్వినియోగం చేసుకునే ముందు ప్రతి విద్యార్థి ఫొటో తీసు కుని 'శాట్స్'తో అనుసంధానం చేస్తే కీలకమైన ప్రక్రియ పూర్తి కానుంది. చివ రలో ఫొటో తీస్తే చాలు ఆ ఫొటోలనే శాట్స్‌లో ఉండే పిల్లల మొహం గుర్తుల ఆధారంగా అక్షాంశాలు, రేఖాంశాలతోపాటు హాజరును నమోదు చేసుకుం టుంది. 'శాట్స్' ఇన్‌హౌస్ వ్యవస్థ అయినందున రహస్యానికి సమస్య లేదు. ప్రతిరోజూ ఉపాధ్యాయులు మొబైల్ ద్వారా తీసే ఫొటో డేటా నమోదు తర్వాత ఫొటో డిలీట్ అయ్యే వ్యవస్థ కూడా ఉంది.

హాస్టళ్లలో అక్రమాలకు చెక్..

ప్రభుత్వం వివిధశాఖలకు అనుబంధంగా రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్లను నిర్వహిస్తోంది. పలు హాస్టళ్లలో అనర్హులు ఆశ్రయం పొందుతున్నారనే విమ ర్శలు ఉన్నాయి. గడిచిన కొన్నేళ్లుగా అక్రమంగా ఉండేవారిని నియంత్రించ డమే హాస్టల్ వార్డెన్‌లకు సవాల్‌గా ఉంది. ఉత్తర కర్ణాటక ప్రాంతంలో ఇదే విషయమై వివాదాలు చెలరేగాయి. హాస్టళ్లలోనూ ఈ నిఘా వ్యవస్థను అమలు చేయడం ద్వారా విద్యార్థులు ఎవరు, అనర్హులు ఎవరనేది స్పష్టంగా తేలనుంది. ఎంతమంది విద్యార్థులు హాస్టల్‌కు హాజరవుతున్నారు, ఎంతమం దికి టిఫిన్ భోజనం అందిస్తున్నారనేది కూడా తెలుసుకోవచ్చు. బెంగళూరు నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఉండే హాస్టళ్లపై నిఘా కొనసాగే వీలుంది.



మీడియాతో మాట్లాడుతున్న పుట్టు ఆంజినప్ప

రేపు శిడ్లఘట్టకు సీఎం

శిడ్లఘట్ట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సీఎం సిద్దరామయ్య ఈనెల 24న శిడ్లఘట్టలో పర్యటించనున్నారు. కాంగ్రెస్ నాయ కుడు పుట్టు ఆంజినప్ప అజ్జకదిరేనహళ్లిలో కార్యకర్తల సమా వేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. హనుమంతపుర సమీపాన అటవీశాఖ కార్యాలయం వద్ద సమావేశానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయన్నారు. సుమారు 23 సంవ త్సరాల తర్వాత ముఖ్యమంత్రి నియోజకవర్గాన్ని సందర్శిస్తున్న తరుణంలో సుమారు రూ.1,800 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారన్నారు. ప్రత్యేకించి రూ.200 కోట్లతో హైటెక్ పట్టుగూళ్ల మార్కెట్ ఈ ప్రాంత పట్టురైతులు, రీలర్స్‌కు ఎంతో సహకారి కానుందన్నారు. నీరావరి పథకాలు, పారిశ్రామిక కారి డార్ అభివృద్ధి సహా పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ ఉంటుందన్నారు. సీఎంతోపాటు డీసీఎం డీకే శివకుమార్ తదితరులు పాల్గొంటారన్నారు. సమావేశానికి సుమారు 50-60వేలమంది కార్యకర్తలు, ప్రజలు పాల్గొనే అవకాశం ఉంద న్నారు. కార్యకర్తల సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సహన రాజీవ్‌గౌడ, చిల కలనేర్పు హోబళి అధ్యక్షుడు కృష్ణరెడ్డి, రాష్ట్ర స్థాయి, జిల్లాస్థాయి, తాలూకా స్థాయి నాయ కులు పాల్గొన్నారు.

అంతకుముందు ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ కూడా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యే నియోజకవర్గానికి కూడా కోట్లాది రూపాయల గ్రాంటు విడుదల చేశా రన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సుధాకర్ కేవలం మూడు నాలుగు రోజుల్లోనే కోట్లాది రూపాయలతో రోడ్ల డాంబరీకరణకు సహ కారం అందించారన్నారు. సమావేశానికి వచ్చేవారికి తాగునీరు, ఆహారం, శౌచాలయ వ్యవస్థ కల్పిస్తున్నట్టు తెలిపారు. సీఎం సమావేశాన్ని విజయ వంతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు.



ముస్తాబవుతున్న బహిరంగ సభావేదిక

ఇసుక ఇక్కట్లు..!

● తీవ్రమైన కొరత
● ఎక్కడికక్కడ ఆగిపోయిన నిర్మాణాలు

బళ్లారి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బళ్లారిలో ఇసుక బంగారమయ్యింది. టిప్పరు 18 టన్నులు రూ.35 వేలకుపైగా ధర పలుకుతోంది. ఇంత ధర చెల్లించడానికి సిద్ధమైనా ఇసుక దొరకడం గగనంగా మారింది. ఇసుక కొరత మూలంగా నగరంలో నూతన భవన కట్టడాలు, ప్రభుత్వ అభివృద్ధి పనులు, రోడ్లు, వంతెనలు, పనులు అనుకున్నంత వేగంగా జరగడం లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. బళ్లారి జిల్లాలో మొత్తం 5 ఇసుక టెండర్లను భూగర్భగనులు శాఖ పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించింది. కానీ రాజకీయ కారణాలు, అధికారులు ఒత్తిళ్లు, ఇతరత్రా కారణాలతో ఇసుక టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ సక్రమంగా ఇసుక రవాణా చేయలేక పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ప్రకారమే ఇసుక రవాణా చేస్తే తనకు ఇబ్బంది ఉండదనే కారణంతో రాజకీయ ఒత్తిళ్లకు తగ్గడం లేదనేది నిష్టూర సత్యం. ఇటు అధి కారులు, రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్ల మధ్య నెలకొన్న విభేధాల కారణంగా బళ్లారి నగ రంలోకి సక్రమంగా ఇసుక రావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఇదే అదు నుగా కొందరు ఇసుక మాఫియా రంగంలోకి దిగి ఇతర ప్రాంతాల నుంచి ఇసుకను రాత్రిపూట దొంగతనంగా రవాణా చేస్తు డబ్బులు సంపాదించుకున్నారు. తుంగభద్ర నది, వాగులు, వంక లతో పాటు పక్కరాష్ట్రంలోని బళ్లారికి దగ్గరలో ఉండే ప్రాంతాల నుంచి ఇసుక రవాణా చేస్తు న్నారు. టిప్పరు ఇసుక, అదీ నాసిరకం అయినా రూ.40 వేలకుపైగా ధర పలుకుతోంది. బళ్లారి చుట్టూ వేదవతి నది ఉంది. సమీపంలో తుంగభద్ర ఉంది. కాంట్రాక్టర్, నాయకుల మధ్య సయోధ్య లేక ఇసుక కొరత ఏర్పడిందని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కలగజేసుకుని ఇసుక కొరత లేకుండా చూడాలని కార్మికులు కోరుతున్నారు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1623.96	1630.67
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,796	3,469
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,981	6,706
నీటి నిల్వ (టీఎంసీలు)	73.14	96.61

పేటె ఆంజనేయస్వామికి పూజలు



సిరుగుప్ప నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణం లోని పేటె ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశనూరు రోడ్డుమార్గంలో వెలసిన ఆంజనేయస్వామికి ఆలయ ప్రధాన అర్చకులు శ్యామాచార్య స్వాముల వారికి పుష్పాలంకార సేవ, ఆకుల పూజ, కుంకుమార్చన, మహామంగళహారతి చేశారు. భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. కమిటీ సభ్యులు ప్రసాద పంపిణీ చేశారు.

30న రామకృష్ణమాచార్యుల వర్ధంతి

బళ్లారి సిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాఘవ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30న రాఘవ కళామందిరంలో దర్మవరం రామకృష్ణమాచార్యుల 113వ వర్ధంతి నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజుసాయంత్రం గుర్రం సాకమ్మ రామయ్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ వారిచే 'మేము చేసిన పాపమేమిటి' అనే సందేశాత్మక సాంఘిక నాటిక ప్రదర్శించనున్నారు. నాటికలో జీఆర్ వెంకటేశులు, కే.కాళిదాసు, మురళీమోహన్, దివాకరశాస్త్రి, రఘురామ, దాదాపీర్ నటించనున్నట్లు వారు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: డీవైఎస్పీ

గంగావతి రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ బ్రాంచ్ డీవైఎస్పీ సిద్దలింగప్ప గౌడ్ పటిల్ అన్నారు. శనివారం గంగావతి తాలూకలోని మరళి గ్రామంలోని ఎంఎస్ఎంఎస్ పాలిటెక్నిక్ కాలేజీలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సైబర్ క్రైమ్ బ్రాంచ్ డీవైఎస్పీ సిద్దలింగప్ప అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు ఎంత వేగంగా విస్తరిస్తున్నాయో, వాటి ప్రమాదాలు జాగ్రత్తలు ఇలా వివరణాత్మకంగా విద్యార్థులకు వివరించారు. ఇంట్లో కూర్చొని డబ్బు సంపాదించాలని అనే పేరుతో వచ్చే యాప్‌లు, ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాల వల్ల ఎంతోమంది జీవితాలు ఛిద్రమయ్యాయని కొప్పళ సైబర్ బ్రాంచ్ అధికారి అంజనేయ అన్నారు. అవసరంలేని యాప్‌లు ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవద్దని, ఈ రకమైన యాప్‌ల ద్వారా ఆకర్షణీయమైన లాభాలు చూపి సైబర్ నేరస్తులు ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగాల కోసం వెతుకుతున్న నిరుద్యోగ యువతను సైబర్ నేరస్తులు ఆకర్షిస్తారన్నారు. తప్పుడు ఉద్యోగాలు పేరుతో బలవంతంగా అక్రమ కార్యక్రమాల్లో పాల్గొనిచే పరిస్థితిని డిజిటల్ అరెస్ట్ గా పిలుస్తారు అని వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు హెచ్.ఎం సిద్దరామయ్యస్వామి, అధికారులు బసవరాజు స్వామి, ప్రినిపల్ శిల్పి, బీఈడ్ ప్రిన్సిపల్ హసేన్ పీరా, డీగ్రీ కాలేజి ప్రిన్సిపల్ మల్లికార్జునస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీవైఎస్పీ సిద్దలింగప్ప గౌడ్ పటిల్

కేంద్ర చట్టాలపై ఏఐయూటీయూసీ నిరసన



నిరసనలో మాట్లాడుతున్న జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ

బళ్లారి సిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న 4 లేబర్ కోడ్(కార్మిక చట్టాలు) కోట్లాదిమంది కార్మికులకు సమస్యగా మారుతున్నాయని ఏఐయూటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమశుఖర్‌గౌడ మండిపడ్డారు. శనివారం నగరంలోని నటరాజ్ థియేటర్ ముందు చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. కేంద్రం తీసుకొస్తున్న లేబర్ కోడ్ సామాన్య కార్మిక ప్రజలకు సమస్యగా మారుతోందని , కేంద్రప్రభుత్వం వ్యాపారాన్ని సులభతరం చేయడం పేరుతో పెట్టుబడిదారీ కార్పోరేట్ సంస్థలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. కార్మికుల హక్కులు, రక్షణను తగ్గించడం ప్రగతి శీల సంస్కరణ కాదన్నారు. ఇది కార్మిక వ్యతిరేకప్రభుత్వమన్నారు. పని గంటలకు సంబంధించిన నియమాలలో మార్పులు, కొన్ని సంస్థలు పని గంటలను 8గంటల నుంచి 12గంటలకు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కార్మికులపై ఒత్తిడి పెంచి ఆరోగ్యం పాడు చేస్తుందన్నారు. ఈకోడ్‌లు వ్యాపారం చేయడంలో సులభతరం దీనిని సాధించడానికి కార్మికులను తొలగించడంలో సులభతరం మార్గాన్ని ఎంచుకున్నాయి. ఇది కార్పొరేట్ రంగానికి దోహదపడుతుందన్నారు. ఈసందర్భంగా ఏఐయూటీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఏ.శాంత, సురేశ్, గీత, చేతన్, ఉమాదేవి నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు పోలీస్ శాఖ

- డీఐజీ వర్తిక కటియార్
- ముగిసిన క్రీడాపోటీలు


విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న డీఐజీ వర్తిక కటియార్

బళ్లారి సిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ క్రమశిక్షణకు పేరొందిందని అలాంటి పోలీసులు క్రీడల్లో పాల్గొని శారీరకంగా ధృడంగా తయారవ్వాలని డీఐజీ వర్తిక కటియార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని డీఏఆర్ గ్రౌండులో జరిగిన మూడు రోజుల పోలీసు వార్షికా క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో విజేతలకు ట్రోఫీలు పంపిణీ చేసిన తర్వాత ఆమె మాట్లాడారు. ఈ సంవత్సరం పోలీసుల క్రీడాపోటీలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. విజేతలందరికి అభినందనలు, ఓడిపోయిన వారు నిరాశ చెందకూడదన్నారు. క్రమశిక్షణ, సంయమనం విలువైన జీవితం చాలా ముఖ్యమైనదన్నారు. పోటీలను విజయవంతం చేసిన పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోలీసు కుటుంబం, పిల్లలు పాల్గొనడం సంతోషకరమన్నారు. రాబోయే రోజుల్లో వారు బాగా రాణించాలని జిల్లా ఎస్పీ శోభారాణి పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న కన్వీనర్ చంద్రమౌళి

జనవరి 11న సనాతన ధర్మ పోటీ పరీక్ష

- వీరశైవ లింగాయత కన్వీనర్ చంద్రమౌళి

బళ్లారి సిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వీరశైవ లింగాయత సమాజం యొక్క మత గ్రంథం సిద్ధాంతంపై జనవరి 11న బసవేశ్వర్ నగరంలోని వుంకి మరిసిద్దమ్మ పాఠశాలలో నిర్వహించబడుతుందని వీరశైవ లింగాయత సమాజం కన్వీనర్ చంద్రమౌళి తెలిపారు. శనివారం పత్రికాభవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీరశైవ లింగాయత సనాతన ధర్మం సమాజంలో నైతిక విలువల గురించి విద్యార్థులలో అవగాహన కల్పించే ప్రయత్నంగా ఈ పోటీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జగద్గురు రేణుకాచార్య , బసవన్న బోధనలు, తత్వశాస్త్రంలతో పరీక్ష నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు రెండు అంశాల్లో పోటీ పడవచ్చన్నారు. ఎంపికైన పది మంది పిల్లలను వారి తల్లిదండ్రుల సమక్షంలో వేదికపై సత్కరిస్తారు. 2026లో కర్ణాటక ప్రభుత్వం నిర్వహించనున్న రేణకాచార్య జయంతి నేపథ్యంలో నిర్వహించే సిద్ధాంత శిఖామణి పోటీలో విద్యార్థులను సత్కరిస్తారన్నారు. విలేకరుల సమావేశంలో వీరశైవ లింగాయత్ సంఘం నాయకులు మల్లనగౌడ, లింగేశ్, ఎర్రిస్వామి, నీలనగౌడ, గౌరీశంకర్,వీరేశ్, గోనాల్ మంజునాథ్, సురేశ్ హంగర్, ఆరాధ్య తదితరులున్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరచుకోవాలి

- ప్రీ-యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ గోపాల్


మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ గోపాల్

బళ్లారి సిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీ తత్వాన్ని పెంపొందించుకోవాలని, చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని ప్రీ-యూనివర్శిటీ డిప్యూటీ డైరెక్టర్ ఇన్‌చార్జి గోపాల్ సూచించారు. శనివారం రాష్ట్ర విద్యార్థి సంక్షేమ నిధి, పాఠశాల విద్యా శాఖ బెంగళూరు, బళ్లారి ప్రిన్సిపాల్స్ అసోసియేషన్, ప్రభుత్వ మాజీ మున్సిపల్ ప్రీ-యూనివర్శిటీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని మున్సిపల్ కళాశాలలో సాంస్కృతిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు పాఠ్యాంశాలు, పాఠ్యేతర కార్యకలాపాల్లో పాల్గొనడం చాలా ముఖ్యమన్నారు. పోటీ పరీక్షలతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందన్నారు. మున్సిపాల్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకప్ప, ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ కార్యదర్శి నాగేశ్వరరావు, లెక్చరర్ తిమ్మప్ప, రాజేంద్ర, ప్రిన్సిపాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్న శివరాం, రమేశ్, వేణుగోపాల్, నాగారెడ్డి తదితరులున్నారు.

30న పేట బసవేశ్వర నీలమ్మ రథోత్సవం

కంప్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 30న కంప్లి పట్టణంలో ప్రసిద్ధిగాంచిన పేట బసవేశ్వర నీలమ్మ రథోత్సవం వైభవంగా చేపడుతున్నట్లు ఆలయం కమిటీ పదాధికారులు ప్రకటనలో తెలిపారు. 26న కంకణధారణ, 28 పేట బసవేశ్వర నీలమ్మ వివాహ మహోత్సవం 29న పూలు అడ్డపల్లకి ఉత్సవం చేపడ్తామన్నారు. రథోత్సవం సందర్భంగా జోడు రథాలను గురువారం బయటికి తీసి పూజలు నిర్వహించారు.


సిద్ధమవుతున్న రథం

అతిథి గృహాన్ని పరిశీలించిన అధికారులు


మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఏఈఈ చందనగౌడ

సిరుగుప్ప నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణ అతిథి గృహంలో శిథిలావస్థకు చేరుకున్న భవనానికి మరమ్మత్తు పనులు చేపట్టేందుకు పీడబ్ల్యూడీ ఏఈఈ చందనగౌడ పరిశీలించారు. శనివారం బస్టాండు ఎదురుగా వున్న అతిథి గృహాన్ని ఏఈఈ పరిశీలించారు. గృహంలో పైకప్పు, తలుపులు, కిటికీలు కూలిపోవడంతో మరమ్మత్తు పనులు చేసేందుకు ఆయన పరిశీలన చేశారు. త్వరలో పనులను ప్రారంభిస్తామన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- బంగారం, నగదు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి ఆభరణాలు

రాయచూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింహనూరు తాలూకా కే హంచినాళలో గత నెల తాళం వేసిన ఇంటిలో దొంగతనానికి పాల్పడిన నిందితుడిని శనివారం పోలీసులకు పట్టుబడ్డాడు. కే హంచినాళ క్యాంప్‌లో నివశిస్తున్న ఏ నాగేశ్వర్ రావ్ అగస్టు 29వ తేదీన ఇంటికి తాళం వేసి బంధువుల దగ్గరికి వెళ్లాడు. తిరిగి అదే నెల 31వ తేదీన ఇంటికి రాగా ఇంటికి వేసిన తాళం విరిగిపడి ఉండడంతో పాటు ఇంట్లో అలమారా ఇతరత్ర తాళాలు విరిగి ఉండడాన్ని గమనించి దొంగతనం అయినట్లు గుర్తించారు. అలమారాలో ఉన్న 52 గ్రాముల బంగారం 360 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు 2.20 లక్షల నగదు దొంగతనానికి గురైనట్లు గుర్తించి వెంటనే సింధనూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు ఫారుక్‌ను అదుపులోకి తీసుకుని అతడి ఉన్న ఉన్న 52 గ్రాముల బంగారు వెండి ఆభరణాలతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నారు. కాగా దొంగతనం కేసును చేదించిన ఎస్పీ పుట్టమాదయ్య, ఏఎస్పీలు అభినందించారు.

హోసూరు జోన్

డీఎంకే వర్కింగ్ కమిటీ సమావేశం


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్

హోసూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పశ్చిమజిల్లా డీఎంకే వర్కింగ్ కమిటీ సమావేశం హోసూరులో శనివారం జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు యువరాజ్ అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే ప్రకాశ్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న 'సర్'కు డీఎంకే భయపడేది లేదన్నారు. తమిళనాడులోని అందరి సభ్యులను ఒకే బృందంలో ఓటరు జాబితాలో చేర్చాలన్నారు. దయచేసి అందరినీ చేర్చండన్నారు. కాగా ఉపముఖ్యమంత్రి పుట్టినరోజును అర్థవంతంగా జరపదలిచామన్నారు. ఈనెల 27నుంచి ఒకనెలపాటు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. జనవరి 14న తిరువణ్ణామలైలో యువజన బృందం తరపున ప్రత్యేక సమావేశం ఉంటుందని యువత ఎక్కువసంఖ్యలో పాల్గొనాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మురుగన్, మేయర్ సత్య, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ గోడౌన్‌లో చోరీ


సీసీ టీవీ ఫుటేజీ

హోసూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): హోసూరులోని ఒక మెడికల్ గోడౌన్‌లో రూ.60వేల విలువైన మందులు చోరీకి గురయ్యాయి. బృందావన నగర్ ప్రాంతంలోని భీమారెడ్డికి చెందిన హోల్‌సేల్ ఔషధగోడౌన్ ఉంది. శనివారం ఉదయం భీమారెడ్డి గోడౌన్ తెరవడానికి వచ్చినప్పుడు తాళం పగులగొట్టి ఉండడాన్ని గుర్తించి షాక్‌కు గురయ్యాడు. గల్లాలోని రూ.60వేలు నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. సీసీటీవీ ఫుటేజీలో ఒక అనుమానిత వ్యక్తి ముఖంపై బట్ట ధరించి చోరీ చేసినట్టు గుర్తించారు. హడ్కో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

టమోటా కిలో రూ.60



హోసూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): టమోటా ధర ప్రస్తుతం కిలో రూ.60 పలుకుతోంది. కృష్ణగిరి జిల్లాలోని హోసూరు, బాగలూరు, పెర్గై, సూలగిరి, ఉత్తనపల్లి తదితర ప్రాంతాలలో 3వేల ఎకరాలకుపైగా టమోటా సాగు అవుతోంది. కొన్ని వారాలుగా వర్షాల కారణంగా టమోటా దిగుబడిపై ప్రభావం చూపింది. దీంతో మార్కెట్‌కు టమోటా సరఫరా తగ్గింది. గతవారం ఫస్ట్‌గ్రేడ్ టమోటా కిలో రూ.35-45వరకు పలికింది. సెకండ్‌గ్రేడ్ రూ.25, థర్డ్‌గ్రేడ్ రూ.15వరకు ఉండేది. తాజాగా శనివారం ఫస్ట్‌గ్రేడ్ టమోటా కిలో రూ.60 పలికింది. సెకండ్ గ్రేడ్ రూ.50, థర్డ్‌గ్రేడ్ రూ.40 పలకడంతో రైతులలో హర్షం వ్యక్తం అవుతోంది. మరోవైపు ప్రజల్లో ఆందోళన నెలకొంది.

లేబర్ కోడ్‌కు వ్యతిరేకంగా ఆందోళన

రాయచూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలులోకి తెస్తున్న నాల్గు లేబర్ కోడ్‌లను నిరవిస్తు ఏఐయూటీయూసీ నాయకులు శనివారం నగరంలోని టిప్పు సుల్తాన్ గార్డెన్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఏఐయూటీయూసీ రాష్ట్ర కార్యదర్శి చన్నబసవ జానేకల్ కార్మికుల హక్కులను హరించేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను కార్మికులు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తు నాల్గు లేబర్ కోడ్‌లు తీసుకురావడం ద్వార కేంద్ర ప్రభుత్వం శ్రమ దోపిడికి పాల్పడుతున్నట్లు ఆరోపించారు. పని గంటలను 11 గంటలకు పెంచడం కార్మికులను యజమానులకు బానిసులుగా మార్చే ప్రయత్నమేనని ఈ సందర్భంగా కార్మికులు ఆరోపిస్తు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు.

లారీ ఢీకొని రైతు, ఎద్దులు మృతి

బళ్లారిరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పొలం నుంచి ఇంటికి వెళ్తున్న రైతును రోడ్డు ప్రమాదం బలిగొంది. బళ్లారిరూరల్ తాలుకాలోని గుత్తి హోస్పేట కొత్త బైపాస్ సమీపంలో ముబ్బుకుంట వద్ద శుక్రవారం ఈ ప్రమాదం జరిగింది. బళ్లారి వైపు నుంచి గుత్తి వైపు వెళ్తున్న లారీ బొబ్బుకుంట గ్రామానికి చెందిన రైతు పింజరి మహమ్మద్ సాహెబ్ (41) వెళ్తున్న ఎద్దుల బండిని ఢీకొంది. లారీ బలంగా ఢీకొనడంతో మహమ్మద్ తీవ్రంగా గాయపడ్డారు. రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. గమనించిన స్థానికులు బళ్లారిరూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మహమ్మద్ సాహెబ్‌ను బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మహ్మద్ ఆస్పత్రిలో మృతి చెందారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో రెండు ఎద్దులు, రైతు మృతిచెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.


ప్రమాదానికి కారణమైన లారీ

సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- కలబుర్గి విభాగ కమిషనర్ వెంకట్‌సింగ్


కమిషనర్ వెంకట్‌సింగ్‌ను సత్కరిస్తున్న పాత్రికేయులు

రాయచూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టాన్ని పాత్రికేయులు మరింత సమర్థంగా వినియోగించుకోవాలని సమాచార హక్కు(ఆర్‌టీఐ) కలబుర్గి విభాగం కమిషనర్ వెంకట్‌సింగ్ సూచించారు. శనివారం జిల్లాకు వచ్చిన వెంకట్‌సింగ్ నగరంలోని పత్రిక భవన్‌లో విలేఖరులతో స్నేహపూర్వకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వెంకట్‌సింగ్, 2005లో అమలులోకొచ్చిన సమాచార హక్కు చట్టం పాత్రికేయులకు అత్యంత ఉపయుక్తంగా మారిందన్నారు. ప్రభుత్వపరంగా అనేక విషయాలను లోతుగా తెలుసుకునే అవకాశం సమాచార హక్కు చట్టం ద్వార లభించిందన్నారు. అత్యధిక మహారాష్ట్రలో 61 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా రాష్ట్రంలో 40 వేలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కలబుర్గి విభాగంలో 7 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని ఈ సందర్భంగా వెంకట్‌సింగ్ తెలిపారు.

నిరంతర కృషితోనే లక్ష్య సాధన

- పర్యావరణ శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసులు

రాయచూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించడం ఒక్కటే మార్గమని ఆ దిశగా విద్యార్థులు తమవంతు ప్రయత్నం కొనసాగించాలని పర్యావరణ శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఉద్భోదించారు. నగరంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయంలో శనివారం నిర్వహించిన విశ్వ విద్యాలయం 17వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీనివాసులు గతంలో పోలిస్తే అనేక సౌకర్యాలు అందుబాటులోకొచ్చాయని వాటిని వినియోగించుకుని విద్యార్థులు సరైన లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా తగిన కృషితో ముందడుగు వేయాలన్నారు. ఉప కులపతి డాక్టర్ మహంతయ్య మాట్లాడుతూ విశ్వ విద్యాలయంలో ఉన్న సౌకర్యాలు విద్యార్థులకు అందిస్తున్న సేవలు తదితర వాటి గురించి వివరించారు. అదే సమయంలో పరిశోధన రంగంలో విద్యార్థులు మరింత పట్టుదలతో రాణించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో నేపాల్‌వాసి మృతి

పెనుకొండ రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీవద్ద 44వ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని గోబీలాల్ బెహ్రా(57)అనే నేపాల్‌వాసి మృతిచెందిన ఘటన శనివారం చోటుచసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు గోబిలాల్‌బెహ్రా తోటి స్నేహితులతో కలిసి నేపాల్ నుంచి బెంగళూరుకు ప్రైవేట్ ట్రావెల్ బస్సులో ప్రయాణిస్తున్నాడు. ఈశ్వర్‌రబ్బర్ ఫ్యాక్టరీ వద్దకు రాగానే బస్సు రిపేరీ కావడంతో గోబీలాల్‌బెహ్రా బస్సుదిగి రోడ్డుదాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గోబీలాల్‌బెహ్రాను 108సాయంతో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





సాయి కుల్వంతు మందిరంలోని సత్యసాయిబాబా మహా సమాధి వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, మంత్రి నారా లోకేశ్



అతిరథులకు స్వాగతం



అలంకరణలో సత్యసాయిబాబా మహాసమాధి

సాయిరాం.. సాయిరాం..!

పుట్టపర్తిలో ఆధ్యాత్మిక పరిమళం.. శత జయంతికి తరలివచ్చిన ప్రముఖులు

సత్యసాయి శత జయంతి వేడుకలకు తరలివచ్చిన ప్రముఖులు, భక్తులతో పుట్టపర్తిలో పండుగ వాతావరణం నెలకొంది. పూర్ణచంద్ర ఆడిటోరియంలో జరిగిన వేడుకలలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పాల్గొని ప్రసంగించారు. సత్యసాయి ప్రేమ సేవలు, ప్రేమ విశ్వవ్యాప్తమని, వాటిని మరింత విస్తరిద్దామని పిలుపునిచ్చారు. సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం, మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. విలువలతో కూడిన విద్య ప్రాధాన్యాన్ని వివరిస్తూ.. భావి తరాలకు మార్గదర్శకం కావాలని పట్టభద్రులకు పిలుపునిచ్చారు. అంతకుమునుపు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులతో కలిసి సత్యసాయి మహా సమాధిని సందర్శించారు.సాయికుల్వంతు మందిరంలో విద్యార్థుల 'సాయికథ గాన సుధ' ప్రదర్శన అలరించింది. వేలాది మంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. దాదాపు 40వేల మందికి నారాయణ సేవ అందించారు. - ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి






రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు స్వాగతం పలుకుతున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్



చిన్నారితో కలిసి వస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము





శత జయంతి వేడుకలలో రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఆర్‌జే రత్నాకర్



స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్



జ్ఞాపికను అందుకుంటున్న ఉప రాష్ట్రపతి, వేదికపై సీఎం, మంత్రి, ట్రస్టు ప్రతినిధులు



రాష్ట్రపతి హాజరైన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, భక్తులు



ఆధ్యాత్మిక జ్యోతి



స్నాతకోత్సవానికి హాజరైన విద్యార్థులు



నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

సత్యసాయిబాబా (జయంతి)



ప్రముఖ ఆధ్యాత్మిక గురువు సత్యసాయిబాబా 1926 నవంబరు 23న అనంతపురం జిల్లా పుట్టపర్తిలో జన్మించారు. అసలు పేరు సత్యనారాయణ రాజు. వేదాంతిగా, గురువుగా, భగవంతుడి అవతారంగా భక్తులు విశ్వసిస్తారు. ఆయన మహిమల పట్ల చాలామందికి అపారమైన విశ్వాసం ఉంది. ప్రశాంతి నిలయంలోని విద్యాసంస్థ దేశవ్యాప్తంగా న్యాక్ నుంచి 'ఏ++' గుర్తింపు పొందిన ఏకైక సంస్థ కావడం గమనార్హం. పుట్టపర్తిలో సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ మెడికల్ సైన్సెస్‌లో 220 పడకలతో ఉచితంగా మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 166 దేశాలలో సుమారు 10వేల సత్యసాయి సేవా సంస్థలు విద్య, వైద్య, సామాజిక సేవలు అందిస్తున్నాయి. 2011 ఏప్రిల్ 23న నిర్యాణం చెందారు.

గీతాదత్ (జయంతి)




నేపథ్యగాయని గీతాదత్ (గీతా ఘోష్ రాయ్ చౌదరి) 1930 నవంబరు 23న ఫరీద్‌పూర్ జిల్లా ఇదిల్‌పూర్ గ్రామం (ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉంది)లో జమీందారీ కుటుంబంలో జన్మించారు. హిందీ, బెంగాలీ క్లాజికల్ ఆర్టిస్ట్‌గా రాణించారు. 1200 హిందీ పాటలకుపైగా ఆలపించారు. మరాఠీ, గుజరాతీ, బెంగాలీ, మైథిలి, భోజ్‌పురి, పంజాబీ భాషలలోనూ పాటలు పాడారు. ప్రముఖ నటుడు, దర్శకుడు గురుదత్‌ను వివాహం చేసుకున్నారు. ఆమె ఆలపించిన ఎవర్‌గ్రీన్ సాంగ్స్ నేటికీ ఆదరణ పొందుతున్నాయి. 1972 జూలై 20న కన్నుమూశారు. 2016లో ఆమె స్మారకార్థం ప్రత్యేక పోస్టల్‌స్టాంప్ విడుదల చేశారు.

సర్ జగదీశ్ చంద్రబోస్ (వర్ధంతి)



'ఫాదర్ ఆఫ్ బెంగాలీ సైన్స్ ఫిక్షన్'గా పేరొందిన 'సర్' జగదీశ్ చంద్రబోస్ 1858 నవంబరు 30న అప్పటి బెంగాల్ ప్రావిన్స్‌లోని మైమెన్‌సింగ్ ప్రాంతంలో (ప్రస్తుతం బంగ్లాదేశ్) జన్మించారు. బయోలజిస్ట్, ఫిజిస్ట్, బొటానిస్ట్‌గా రాణించారు. సైన్స్ ఫిక్షన్‌పై ఎన్నో వ్యాసాలు రాశారు. రేడియో, మైక్రోవేవ్ ఆప్టిక్స్‌పై పరిశోధనలు చేశారు. వృక్ష భౌతిక శాస్త్రంలో కొన్ని అద్భుతమైన ఆవిష్కరణలు చేశారు. మొక్కల ఎదుగుదలకు సంబంధించి 'క్రెస్కోగ్రాఫ్' అనే పరికరాన్ని ఆవిష్కరించారు. 1904లో అమెరికా దేశపు పేటెంట్ హక్కులు పొందిన తొలి భారతీయుడు కావడం విశేషం. 1937 నవంబరు 23న కన్నుమూశారు.

రోల్డ్ డాహ్ల (వర్ధంతి)



బ్రిటీష్ నవలా రచయిత రోల్డ్ డాహ్ల 1916 సెప్టెంబరు 13న జన్మించారు. కవిగా, చిన్నకథల రచయితగా, స్క్రీన్ రైటర్‌గా రాణించారు. 20వ శతాబ్దంలో గ్రేటెస్ట్ స్టోరీ టెల్లర్స్ ఫర్ చిల్డ్రన్‌లో ఒకరిగా నిలిచారు. ఆయన రాసిన కథలు ప్రపంచవ్యాప్తంగా 250 మిలియన్ కాపీలకుపైగా అమ్ముడయ్యాయి. రాయల్ ఎయిర్ ఫోర్స్ అండ్ రోజ్ టు ది ర్యాంక్ ఆఫ్ యాక్టింగ్ వింగ్ కమాండర్‌గా వ్యవహరించారు. 1990 నవంబరు 23న ఆయన కన్నుమూశారు.

ఆహారమేళా ప్రారంభం



ఆహారమేళాను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ మిర్జాకామిల్

ముళబాగిలు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రధాన స్రవంతిలో విద్యార్థులు పోటీపడి రాణించేందుకు ఇలాంటి వాణిజ్య కార్య క్రమాలు దోహదపడతాయని బాలికల ప్రభుత్వ పీయూ కళాశాల ప్రిన్సిపాల్ మిర్జా కామిల్ బేగ్ అభిప్రాయపడ్డారు. ముళబాగిలులోని బాలికల ప్రభుత్వ పీయూ కళాశాలలో విద్యార్థుల ఆహార మేళా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు కేవలం పాఠాలకే పరిమితం కాకుండా నిరంతరం సాహిత్యం, సాంస్కృతిక, క్రీడా మనోభావాలు పోటీలతోపాటు ఇలాంటి ఆమార మేళాలను ఏర్పాటు చేయడం ద్వారా చురుగ్గా ఉండాలన్నారు. కన్నడ అధ్యాపకులు జేజీ నాగరాజ్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు కేవలం ప్రభుత్వ ఉద్యోగాలను నమ్ముకోకుండా స్వావలంబనతో ముందుకు సాగేందుకు ఇలాంటి మేళాలు మానసిక స్థైర్యాన్ని కల్పిస్తాయన్నారు. ఆహారమేళాలో సుమారు 40వేల రూపాయల వ్యాపారం చేయడం ద్వారా తమ నైపుణ్యాన్ని ప్రదర్శిం చారు. కామర్స్ లెక్చరర్ సీ మంజునాథ, కీర్తన, నారాయణ స్వామి, శ్రీహరి, కవిత, దయానంద్, మోనిక తదితరులు పాల్గొన్నారు.

కన్నడ భాషను కాపాడుకుందాం



పౌరకార్మికులకు దుస్తుల పంపిణీ

బొమ్మనహళ్ళి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కన్నడభాషను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కన్నడ రాజ్యోత్సవ కార్యక్రమంలో కవులు కళాకారులు అభిప్రాయపడ్డారు. బీటీఎం లే అవుట్ కువెంపు ఉద్యాన వనంలో 70వ కన్నడ రాజ్యోత్సవం శనివారం ఉదయం ఘనంగా జరిగింది. కవుల ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కొంతమంది కన్నడభాషను కించపరిచేలా వ్యవహరిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు వాసు, మాజీ కార్పొరేటర్ జీఎన్ఆర్ బాబు మాట్లాడుతూ ఉద్యోగం, వ్యాపారం తదితర వాటికి ఇతర రాష్ట్రాల ప్రజలు రాష్ట్రానికి వలస వచ్చారని వారు తప్పకుండా కన్నడభాష నేర్చుకోవాలన్నారు.బీబీఎంపీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హరీశ్‌బాబు, సుబ్రమణ్యం, ముత్తురాయ, అశ్వత్థప్ప తదితరులు పాల్గొన్నారు.

సచిన్‌కు మండ్య డీసీసీ బ్యాంకు పగ్గాలు



సచిన్, చలువరాజుతో సహకార బ్యాంకు డైరెక్టర్లు

బెంగళూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండ్య జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతన అధ్యక్షుడిగా ఎన్ చలువరాయ స్వామి కుమారుడు సచిన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మద్దూరుకు చెందిన సీ చలువరాజు ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. శనివారం కాంగ్రెస్‌కు మద్దతుదారుల మెజారిటీతో ఎన్నికయ్యారు. అనంతరం సచిన్ మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు అను కూలం గా రైతులకు మరిన్ని రుణాలు ఇచ్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. 12మంది డైరెక్టర్ల స్థానాలలో ఒకరు మాత్రమే జేడీఎస్ ఉండగా మిగిలిన 11మంది కాంగ్రెస్ మద్దతుదారులు ఉన్నారు. అయినా అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు పైపోటీ నెలకొంది. చివరకు నాగమంగల తాలూకా ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘం నుంచి డైరెక్టర్‌గా సీ సచిన్ రంగప్రవేశం చేశాడు. మంత్రి కుమారుడు కావడంతో మిగిలిన డైరెక్టర్లందరూ సచిన్‌కు మద్దతు ఇచ్చారు. దీంతో అధ్యక్షస్థానానికి సచిన్ ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు.

డీకే శివకుమార్ సీఎం కావాలని తులాభారం

పావగడ, నవంబరు22(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పదవి చేపట్టాలని ఆయన అభిమానులు శనివారం శనైశ్వర ఆలయంలో 91కేజీల నువ్వుల నూనెతో తులాభారం చేయించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. రెండున్నర సంవత్సరాలకు గాను కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి పదవి చేపట్టాలని నిర్ణయించడంతో డీకే శివకుమార్‌కు కుజదోషం, శనిదోషం, తల్లిదండ్రులైన కెంపేగౌడ, గౌరమ్మ, ఉష కుటుంబ సభ్యులందరి తరఫున అర్చన చేయించారు. మాజీ టీపీ సభ్యుడు హనుమంతరాయప్ప, గోవిందరాజు, చిక్కన్న, హరీష్, ఉమాపతి పాల్గొన్నారు.

యమరెలో కన్నడ రాజ్యోత్సవం



విజేతలకు బహుమతి ప్రదానం

దొమ్మసంద్ర, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా యమరె గ్రామపంచాయతీ పరిధిలోని చంబేనహళ్ళిలోని ఐఎస్ఎంతఈ కళాశాల ఆవరణలో సర్జాపుర రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కన్నడ రాజ్యోత్సవం జరిగింది. సర్జాపుర చుట్టుపక్కల గల అపార్ట్‌మెంట్‌వాసులు పాల్గొని కన్నడగీతాలను ఆలపించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ, రాజ్యోత్సవ రీల్స్ పోటీల్లో పాల్గొన్నారు. ఉత్తమంగా రీల్స్ చేసినవారికి బహుమతులు ప్రదానం చేశారు. వాకిల్ శాటిలైట్ టౌన్‌షిప్ బృందం ప్రథమ బహుమతి అందుకుంది. రెండో బహుమతిని కాన్ఫిడెంట్ జేడ్, మూడో బహుమతిని క్రిస్టల్ క్యాంపస్ జట్లు పొందాయి. పత్రికారంగంలో వివిధ విభాగాల్లో సేవలందించిన సీనియర్ రిపోర్టర్ రోజా, వింధ్యా, చక్రవర్తి వెంకటేశ్, విద్యారంగంలో డాక్టర్ నితిన్‌గార్గ్, సామాజిక సేవలో మెబల్ చకో, ఆనిశ్ దంపతులు, సిబి క్రైథారన్, మైదూశ్, స్టాన్లీలను సర్జాపుర రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు జగదీశ్ కొట్టర్ శెట్టర్, ముఖ్యులు జాయ్ వీఆర్, అసోసియేషన్ పదాధికారులు ప్రియా, సతీశ్, స్టాన్లీ, కిశోరి పాల్గొన్నారు.

శ్రీకృష్ణ డిగ్రీ కళాశాలలో కన్నడ రాజ్యోత్సవం



కన్నడరాజ్యోత్సవంలో ప్రముఖులు

బెంగళూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీకృష్ణ డిగ్రీ కళాశాలలో నవచైతన్య కన్నడ బళగ ఆధ్వర్యంలో 70వ కన్నడ రాజ్యోత్సవం సంబరంగా సాగింది. ముఖ్యఅతిథులుగా జానపద గా యకులు, రాజ్యోత్సవ పురస్కార గ్రహీత డాక్టర్ అప్పగెరె తిమ్మరాజు, సంస్థ సంస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎం రుక్మాంగదనాయుడు, పీజీ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ వేణుగోపాల్, విద్యావిభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్‌పీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు. కన్నడ పతాకాన్ని ముఖ్యఅతిథి డాక్టర్ అప్పగెరె తిమ్మరాజు ఎగురవేసి మా ట్లాడుతూ కువెంపు తమ సాహిత్యం ద్వారా ప్రజలను ఎంతో చైతన్యం చేశారన్నారు. కన్నడకు 8 జ్ఞానపీఠ పురస్కారాలు రావడం గర్వకారణమన్నారు. రుక్మాంగదనాయుడు మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులు, గురువులను గౌరవించడం నేర్చు కోవాలన్నారు. కన్నడ భాషను నేర్చుకుని భాషాభిమానం చాటాలన్నారు.

ఓటు చౌర్యంతోనే అధికారంలోకి బీజేపీ

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్‌దత్ ఆరోపణ

శిడ్లఘట్ట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఓటు చౌర్యం ద్వారా బీజేపీ అధికారంలోకి వస్తోందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్‌దత్ ఆరోపించారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఓటు చౌర్యం అభియానను చేపట్టారన్నారు. శిడ్లఘట్టలో శుక్రవారం సాయంత్రం రాజీవ్‌గౌడ నేతృత్వంలో ఏర్పాటైన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆగ్నేయ ఉపాధ్యాయ ఎన్నికల్లో ఓట్లు వేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు. కాగా పార్టీలో గ్రూపు రాజకీయాలు, క్రమశిక్షణ ఉల్లంఘనను సహించేది లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నిరంజన్, కేంద్ర సహకారబ్యాంకు డైరెక్టర్ ఎం నాగరాజ్, పంప్ నాగరాజ్, నగరసభ సభ్యులు తన్వీర్‌పాషా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు సహనా తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్‌దత్

విద్యతోనే ప్రగతి

బెంగళూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యతోనే జీవితంలో ప్రగతి సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. ఎనేబ్లింగ్ ఎవల్యూషనరి ఎక్సలెన్స్ (ఈక్యూబ్) స్యాప్ చాంపియన్స్ పురస్కారాలు 2025 కార్యక్రమం నగరంలోని మీనాక్షి రంగమంచ సభాంగణంలో జరిగింది. 350కుపైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, వివిధ పరిశ్రమల ప్రముఖులు పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులలో సానుభూతి, సామాజిక చైతన్యం, నాయకత్వ లక్ష ణాలు పెంచేందుకు స్యాప్ కార్యక్రమాన్ని చేప ట్టారు. వార్షిక పురస్కారాలు ప్రదానం చేశారు. ఐదు రాష్ట్రాలనుంచి 14వేలకుపైగా విద్యార్థులు పాల్గొనగా వివిధ వడపోతల అనంతరం 750మందిని ఫైనల్స్‌కు ఎంపిక చేశారు. పర్యావరణ సంరక్షణ, ఆరోగ్య జాగృతి, ప్రాణుల సంక్షేమం, మానసిక ఆరోగ్యం, విద్య, నీటి సంరక్షణ, చెత్త నిర్వహణ వంటి సమస్యలపై పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. ఈఫిల్ విద్యాసేవలు, ఈక్యూబ్ ఫౌండర్ డైరెక్టర్ డాక్టర్ జేఎం సంపత్ మాట్లాడుతూ యువతలో సామాజిక చైతన్యంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈక్యూబ్ డైరెక్టర్ డాక్టర్ కల్పనా సంపత్ మాట్లాడుతూ స్యాప్ ద్వారా విద్యార్థులలో బాధ్యతను పెంచుతున్నామన్నారు. రిటైర్డు ఐఏఎస్ కే జైరాజ్ చాంపియన్ల పురస్కారాలను ప్రదానం చేశారు. సంహితా అకాడమీ ట్రస్టీ థామస్, పీ అండ్ పీ గ్రూప్ సంస్థాపకులు రూపాండె, సమాజసేవకులు అనిరుద్ధ జట్కర్ పాల్గొన్నారు.